క్లుప్తంగా

300 మందికి ఉచిత కంటి పరీక్షలు



ఉచిత వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

ద్వారకాతిరుమల: విజ్‌డమ్ ఫౌండేషన్, రామకృష్ణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ పులవర్తి రామకృష్ణ పర్యవేక్షణలో స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన పీవీ బ్రదర్స్ తమ తండ్రి జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏలూరుకు చెందిన ప్రముఖ వైద్యురాలు ప్రభావతి, జంగారెడ్డిగూడెంకు చెందిన ఆర్‌కే డయాగ్నోసిస్ ల్యాబ్ నిర్వాహకులు వైద్య సేవలందించారు. కంటి శుక్లాలు, దృష్టి లోపం ఉన్న వారిని గుర్తించి, చికిత్స పొందే విధానంపై అవగాహన కల్పించారు. సుమారు 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు రామకృష్ణ, కిరణ్, హేమంత్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఏకాదశి పూజలు



మదన గోపాలునికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : శ్రావణమాసం ఏకాదశి పురస్కరించుకొని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గుడి శేషాచార్యులు ఆధ్వర్యంలో పంచామృత స్నపన, స్వామివారికి అభిషేకాది పూజలతో సహా దేవేరులకు అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా గవరవరంలో శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామికి పూజలు జరిపారు. ఆరిపాటి శ్రీ అభయ ఆంజనేయస్వామి, బయ్యనగూడెం అభయ ఆంజనేయస్వామి ఆలయాల్లో ఏకాదశి పూజలు నిర్వహించగా భక్తులు దేవతా పారాయణాది కార్యక్రమాలు నిర్వహించారు.

హిందీ మాస్టారుకు సన్మానం



హిందీ మాస్టారు నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

కామవరపుకోట : కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పోరంకి నాగరాజును అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు వైఎంహెచ్ఏ హాలులో సన్మానం నిర్వహించారు. తెలుగు భాష దినోత్సవంలో భాగంగా అపహాస్యమౌతున్న జీవితాలు మావి అనే కవితను నాగరాజు మాస్టారు చదవి వినిపించారు. కళావేదిక జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, రాష్ట్ర సాహితీ అకాడమీ చైర్‌పర్సన్ పిళ్ళంగోళ్ళ శ్రీలక్ష్మి హిందీ ఉపాధ్యాయులు నాగరాజును సత్కరించి మొమెంటో, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

డీఈవో దంపతులకు సన్మానం



డీఈవో శ్యాంసుందర్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

చింతలపూడి: విధి నిర్వహణ ఎన్నో ఒత్తిళ్లతో కూడుకుని ఉంటుందని, అయినప్పటికీ ప్రజలకు తన పరిధిలో మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తానని డీఈవో పులపర్తి శ్యాంసుందర్ అన్నారు. చింతలపూడి సీఎస్ఐ టౌన్ చర్చ్‌లో ఆదివారం డీఈవో శ్యాంసుందర్ దంపతులను సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు కేఎస్ఎస్ బాబూరావు మాట్లాడుతూ శ్యాంసుందర్ జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు, స్నేహితులు, ఉపాధ్యాయులు శ్యాంసుందర్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

పేకాట స్థావరంపై దాడి

పెదవేగి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం కొప్పాకలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేయగా, ఘటనా ప్రదేశంలో రూ.2,100 నగదు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పశువుల ఆరోగ్య పరిరక్షణకు టీకా

- వాతావరణ మార్పులతో వ్యాధుల బారిన పడుతున్న పశువులు
- సకాలంలో వైద్యం అందించాలంటున్న అధికారులు
- గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు, లంపీ స్కిన్ డిసీజ్‌కు టీకాలు



పెయ్యిదూడలకు టీకాలు వేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: పశువులకు వచ్చే వివిధ వ్యాధుల పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధుల వల్ల పశువులలో పనిచేసే శక్తి, పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. అయితే పశువులకు వచ్చే వ్యాధుల్లో ముఖ్యమైనవి గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వ్యాధి. అలాగే లంపీ స్కిన్ డిసీజ్ కూడా పశువుల్లో ఎక్కువగా కనిపిస్తున్నట్లు పశువైద్యాధికారులు చెబుతున్నారు. ఈ వ్యాధులు సోకడం వల్ల లేగదూడలు, పెయ్యలు ఎక్కువ సంఖ్యలో మరణించే అవకాశం ఉందని వారు చెప్తున్నారు. అలాగే పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గి ఆర్థిక నష్టం కలుగుతుంది. ఈ పరిస్థితుల్లో పశువుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచిత టీకా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సకాలంలో పశువులకు వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. సకాలంలో టీకా వేయిస్తే పశువులకు అది శ్రీరామరక్ష అని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో 39,876 పశువులకు టీకాలు

పశువులకు ఇచ్చే వ్యాధుల నివారణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పశు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఇప్పటి వరకూ 70 శాతం వరకూ పశువులకు టీకాలు వేసినట్లు అధికారులు చెప్తున్నారు. ముఖ్యంగా లంపీ స్కిన్ డిసీజ్‌తో ఉన్న 38,567 పశువులకు టీకాలు వేయడం జరిగింది. అలాగే గొంతు వాపు వ్యాధి సోకిన 39,876 పశువులకు టీకాలు వేసినట్లు అధికారులు చెప్పారు. ఆడ పెయ్యి దూడ సంరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటిలో భాగంగా 3200 పెయ్యి దూడలకు బ్రూసెల్లో వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేసినట్లు అధికారులు చెప్పారు. రైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని అధికారులు సూచిస్తున్నారు.

పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్నాం



పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి, గొంతువాపు, లంపీ స్కిన్ డిసీజ్‌ల నివారణకు వ్యాక్సిన్‌ల కార్యక్రమం చేపడుతున్నాం. వాతావరణం మార్పు వల్ల పశువులు ఈ వ్యాధి బారిన పడతాయి. రైతులు పశువుల్లో వచ్చే ఈ వ్యాధిని గుర్తించి సకాలంలో వైద్యసేవలు అందించకపోతే అవి మృత్యువాత పడే అవకాశం ఉంది. నియోజకవర్గంలో గొంతువాపుకు సంబంధించి 39,876 పశువులు, లంపీ స్కిన్ డిసీజ్ 38,567 పశువులకు, అలాగే బ్రూసెల్లో వ్యాధి సోకకుండా 3,200 పెయ్యి దూడలకు టీకాలు వేశాం.

– డాక్టర్ ఎం. సాయి బుచ్చారావు, పశువర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, జీలుగుమిల్లి

శ్రీవారి ఆలయానికి శ్రావణ శోభ

ద్వారకాతిరుమల: శ్రావణమాస పర్వదినాలను పురస్కరించుకుని ద్వారకాతిరుమల క్షేత్రం భక్తులతో కళకళలాడుతోంది. వేలాది మంది భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. సెలవుదినం కావడంతో ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంతో పాటు, అనివేటి మండపం, ప్రధాన రాజగోపుర మెట్ల దారి భక్తులతో కళకళలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు నిరంతరాయంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. శాకాంబరి దేవిగా దర్శనమిస్తున్న క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారిని భక్తులు తిరుగు ప్రయాణంలో దర్శించి, తరించారు. భక్తులందరికీ దేవస్థానం అధికారులు ఉచిత అన్న ప్రసాదాన్ని అందిస్తున్నారు. అలాగే అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు.



ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో భక్తుల తాకిడి



స్వామివారి దర్శనానంతరం ఆలయ ప్రధాన రాజగోపుర మెట్ల మార్గం గుండా వస్తున్న భక్తులు



శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీవారిని దర్శిస్తున్న భక్తులు



శాకాంబరి అలంకారంలో శ్రీ కుంకుళ్లమ్మ తల్లి

తపాలా ఉద్యోగుల 5కే వాక్



5కే వాక్‌లో పాల్గొన్న తపాలా ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్) : జాతీయ క్రీడా దినోత్సవంను పురస్కరించుకుని ఏలూరు తపాల ఉద్యోగులు ఆదివారం స్థానిక మినీ బైపాస్ రోడ్డులో 5కే వాక్‌ను నిర్వహించారు. క్రీడలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ 5కే వాక్‌ను నిర్వహించినట్లు ఏలూరు డివిజన్ సూపరింటెండెంట్ బి.అంబేడ్కర్ తెలిపారు. భారతీయ హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు ఆగస్టు 29ని కేంద్ర ప్రభుత్వం జాతీయ స్పోర్ట్స్ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు క్రీడా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజన్ సూపరింటెండెంట్ డి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్స్ అభిషేక్, డివిజన్ పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జీవనం ఆదర్శప్రాయం



మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమంలో పాల్గొన్న పెయింటర్స్ యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్) : మదర్ థెరిస్సా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తోటి వారికి సాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య అన్నారు. స్థానిక రమామహాల్ సెంటర్లో మదర్ థెరిస్సా పెయింటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం థెరిస్సా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమయ్య మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే స్ఫూర్తితో ఖండాంతరాలు దాటి వచ్చి దేశంలో నిరుపేదలు, అభాగ్యులు, అనాథలు, కుష్టు రోగులకు ఎనలేని సేవలందించిన మదర్ థెరిస్సా జీవనం అందరికీ ఆదర్శ ప్రాయమని అన్నారు. యూనియన్ వ్యవస్థాపకులు అయినపర్తి మాధవరావు, తమ్మినేని నాగరాజు, బి.సోమయ్య మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి బంగారు బాబు, సహాయ కార్యదర్శి పి.రాము, శేఖర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు కొనసాగించాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరింది.

సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలి



ధార్మిక సమావేశంలో మాట్లాడుతున్న హాసీబ్ మదని

ఏలూరు (టూటౌన్): సమాజ సేవలో యువత భాగస్వాములై రాబోయే తరానికి ఆదర్శంగా నిలవాలని అబ్దుల్ హాసీబ్ ఉమ్రి మదని పిలుపునిచ్చారు. మనమంతా ఒక్కటే మన అందరి సృష్టికర్త ఒక్కడే అనే అంశంపై జమియ్యత్ అహ్లెహదీస్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక టుబాకో మర్చంట్ కళ్యాణ మండపంలో ఆదివారం ధార్మిక సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మదని మాట్లాడుతూ సమాజంలో శాంతి ప్రేమను పంచుతూ ఒక భారతీయుడిగా దేశం, సమాజం కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు. మనుషులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దేవ గ్రంథంలో ఉన్న విషయాలను కప్పిపుచ్చి మనిషిని భయభ్రాంతులకు గురిచేసి సృష్టి రాశులను పూజించే విధంగా వలయం ఏర్పాటు చేశారన్నారు. నేటి యువత నైతిక విలువలుకలిగి ఉండాలన్నారు. సభాఅధ్యక్షుడు జమ్మియత్ అహలే హదీస్, రాష్ట్ర అధ్యక్షుడు ఫజలురహ్మాన్ ఉమ్రీ మాట్లాడుతూ ఖురాన్, హదీసు అనుగుణంగా జీవితం గడపాలన్నారు. దేశంలో ఏదైనా ఆపద వస్తే ముస్లింలు ముందుండి ప్రజలను రక్షించడంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సహాయం చేసిన సందర్భాల్లో కరోనా ఒకటని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు, నాయకులు, యువత పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాతూరు ట్రాక్ మరమ్మతులు



పాతూరులో ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో మూసి ఉన్న గేటు

భీమడోలు: జాతీయ రహదారి పక్కనే ఉన్న పాతూరు వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు ట్రాక్‌కు అత్యవసర మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో గేటు మూసి వేస్తున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. 27వ తేదీ నాటికి కూడా పనులు కొనసాగుతున్నాయి. సాంకేతిక కారణాలతో పాటు వర్షాలు కురవడంతో పనులకు ఆటంకం కలిగిందని అధికారులు చెప్పారు. ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే సూరప్పగూడెం గ్రామ ప్రజలు, రైతులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సూరప్పగూడెం ప్రాంత రైతులకు పాతూరు ఏరియాలోని వరి క్షేత్రాలకు వెళ్లాలంటే ఈ గేటు దాటాల్సిందే. ట్రాక్ మరమ్మతులతో రైతులు వెళ్లేందుకు అవకాశం లేక నానా తిప్పలు పడుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తదితరులు

పెదవేగి : మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతోపాటు కుట్టు మిషన్లు అందజేసిన 315 జి ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ పేర్కొన్నారు. పెదవేగిలోని ఎస్ఎంసీ ఉన్నత పాఠశాలలో పలు సేవా కార్యక్రమాల్లో గవర్నర్ మాణిక్యాలరావు, లయన్స్ క్లబ్ ఏలూరు విజన్ అధ్యక్షురాలు చుక్కా పావనితో కలిసి ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ చేతి వృత్తుల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని అన్నారు. ముందుగా ముందు మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ సహకారంతో 120 సైకిళ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు నిత్యావసర సరుకులను అందజేశారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఉపాధ్యాయులకు, మహిళలకు, విద్యార్థులకు నా మొక్క, నా శ్వాస కార్యక్రమంలో భాగంగా 5 వేల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్లోబల్ సర్వీస్ కో ఆర్డినేటర్ చుక్కా అవినాష్ రాజు, సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజేస్, కె. పద్మావతి, పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

ఆయిల్‌పామ్ మొక్కల పీకివేతపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఆయిల్‌పామ్ మొక్కలు పీకివేశారని జంగారెడ్డిగూడెంకు చెందిన బాధితుడు బేతిరెడ్డి నాగేశ్వరరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సైం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 26వ తేదీన నాగేశ్వరరెడ్డికి చెందిన పొలంలోకి జంగారెడ్డిగూడెంకు చెందిన కొవ్వూరి రామారెడ్డి, మరో 11 మంది దౌర్జన్యంగా ప్రవేశించి, పొలంలోని ఆయిల్‌పామ్ మొక్కలు పీకివేశారన్నారు. ఈ మొక్కల విలువ రూ.27 వేలు ఉంటుందన్నారు. అడ్డుకోబోయిన తనపై దౌర్జన్యం చేసి తనను, తన కుమారుడిని చంపేస్తామని బెదిరించారని నాగేశ్వరరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు జీలుగుమిల్లిలో ఆరోగ్యశ్రీ వైద్య శిబిరం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి ప్రభుత్వాస్పత్రిలో ఏలూరు చైత్ర సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, జంగారెడ్డిగూడెం త్రినేత్ర హాస్పటల్ సహకారంతో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత ఆరోగ్యశ్రీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.రాజీవ్ తెలిపారు. ఈ ఆరోగ్యశ్రీ వైద్యశిబిరాల్లో చెవి, ముక్కు, గొంతు, జనరల్ సర్జరీ, జనరల్ విభాగం, ఆయాసం, దగ్గు, ఊపిరితిత్తులు, ఉబ్బసం, ఫిట్స్, మెదడు, పాముకాటు, తేలుకాటు, తలపోటు, నిమోనియా, కామెర్లు, గ్యాస్ట్రిక్ తదితర సమస్యలకు నిపుణులచే వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అలాగే విష జ్వరాలకు, బీపీ, షుగర్ పరీక్షలు కూడా వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా ఆపరేషన్లు చేసి మందులు ఇస్తారని, ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారులచే సరస్వతీ పూజ



నూకాలమ్మ ఆలయంలో సరస్వతి పూజ చేస్తున్న చిన్నారులు

జంగారెడ్డిగూడెం : శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం పురస్కరించుకుని పట్టణంలోని నూకాలమ్మ అమ్మవారి దివ్యసన్నిధిలో సామూహిక సరస్వతి పూజ నిర్వహించారు. ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ ముఖ మండపంలో చిన్నారులచే ముందుగా గణపతి పూజ చేయించి అనంతరం సరస్వతీ పూజ జరిపించారు. సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులకు పుస్తకం, కలం అమ్మవారి ప్రసాదంగా ఆలయ కమిటీ అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు) తెలిపారు. ఆగస్టు 30న సాయంత్రం నాలుగు గంటల నుంచి శ్రావణ పౌర్ణమి సందర్భంగా లోక కళ్యాణం కోసం 54వ చండీహోమం నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

తెలుగు ఉపాధ్యాయుడికి సత్కారం



పెద్దిరాజును సత్కరిస్తున్న ప్రతాప్, శ్రీలక్ష్మి తదితరులు

ద్వారకాతిరుమల: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో, ఏలూరులోని వైఎంహెచ్ఏ హాల్లో ఆదివారం 123వ జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. అందులో పాల్గొన్న మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ మద్దాల పెద్దిరాజు 'మాతృమూర్తి' అనే కవితను చదివి వినిపించారు. దాంతో కళావేదిక జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, రాష్ట్ర సాహితీ అకాడమీ చైర్‌పర్సన్ పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి పెద్దిరాజును ఘనంగా సత్కరించారు. దుశ్శాలువా కప్పి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

రెండు రోజులు విద్యుత్ సరఫరాలో కోతలు

టి.నరసాపురం : ఈనెల 28, 29 తేదీల్లో నూతనంగా నిర్మించిన 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి తిరుమలదేవిపేట సబ్‌స్టేషన్‌కు నూతన వైర్లు అనుసంధానం చేసే నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమలదేవిపేట సబ్‌స్టేషన్ పరిధిలో రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. తిరుమలదేవిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో జీవు రాజు కాంప్లెక్స్ ప్రాంగణ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రజలను ఆకట్టుకుంటుంది. జెయింట్ వీల్, డిస్కో రాక్స్, జంగిల్ బోనంజ, వంటి సుమారు పదికి పైగా ఏర్పాటు చేసిన ఆటవిడుపు యాంత్రిక పరికరాలు ప్రజలను ఉత్తేజపరుస్తున్నాయి. కాగా ఈ ఎగ్జిబిషన్‌ను వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖ అధికారులు ప్రారంభించి నిర్వాహకులకు ప్రజల రక్షణ నిమిత్తం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

వేళంగిణి ఆరోగ్యమాత ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: ప్రతి ఒక్కరూ దేవుని ఆజ్ఞలకు అనుగుణంగా ప్రేమ, సేవ, దయా గుణంతో ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. ఆదివారం వేగవరం పారిస్ క్రీస్తు ఫాదర్ మోజెస్, విచారణ సంఘ పెద్దలు, గ్రామస్తులు, ఉపదేశీయుల ఆధ్వర్యంలో వేళంగిణి ఆరోగ్యమాత ఉత్సవాలను పొలిమేర జయరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫాదర్లతో జయరావు దివ్యబలి పూజ అర్పించారు. సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ పారిస్ క్రీస్తు ఫాదర్ మోజెస్, సంఘ పెద్దలు సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.